# సాక్షి నాగర్‌కర్నూల్

మంగళవారం ׀ 26 ׀ సెప్టెంబర్ ׀ 2023






**ఎట్టకేలకు..**

జూరాల ప్రాజెక్టు రహదారి పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి.

వివరాలు 8లో ▸



**ఆశావర్కర్ల నిరసన**

ఆశా వర్కర్ల యూనియన్ పిలుపు మేరకు పాత కలెక్టరేట్ ఎదుట సమ్మె నిర్వహించారు.

వివరాలు 9లో ▸

గరిష్టం/కనిష్టం 32.7 /21.2

**వాతావరణం**

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉదయం చల్లగా ఉంటుంది. ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### వట్టెం వెంకన్న పవిత్రోత్సవాలు ప్రారంభం



**బిజినేపల్లి:** మండలంలోని వట్టెం వేంకటేశ్వర స్వామి దేవస్థాన పవిత్రోత్సవాలు సోమవారం సాయంత్రం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల సందర్భంగా ఆలయ అర్చకులు బుధవారం సాయంత్రం అంకురార్పణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసినట్లు ఆలయ కమిటీ తెలియజేశారు.

### గణేష్‌కు గ్లోబల్ పీస్ అండ్ హ్యుమానిటేరియన్ అవార్డు




**అచ్చంపేట:** అచ్చంపేటకు చెందిన వరల్డ్ హ్యుమన్ రైట్స్ కౌన్సిల్ తెలంగాణ వర్కింగ్ చైర్మన్ అంబోతు గణేష్ నాయక్‌కు అంతర్జాతీయ శాంతి దినోత్సవం సందర్భంగా థాయిలాండ్ రాయల్ థాయి ఎయిర్ ఫోర్స్ బ్యాంకాక్‌లో గ్లోబల్ పీస్ అండ్ హ్యుమానిటేరియన్ అవార్డును యూఎన్‌పీకెఎఫ్‌సీ గ్లోబల్ ప్రెసిడెంట్ డాక్టర్ అపినిత చైచన చేతుల మీదుగా అందుకున్నాడు. డబ్ల్యూహెచ్‌ఆర్‌సీ(ప్రపంచ మానవ హక్కుల సమితి) 62 దేశాల ప్రతినిధులు పాల్గొన్న కార్యక్రమంలో భారత దేశం నుంచి ఇద్దరికి అవకాశం రాగా.. వారిలో గణేష్ నాయక్ ఒకరు. అంతర్జాతీయ మహాసభల్లో భారతదేశంలో మానవ హక్కుల సమితి చేస్తున్న సేవలు గుర్తించి ఈ అవార్డు అందజేశారు. ప్రపంచ శాంతి, గోల్స్, సంపూర్ణ ప్రపంచశాంతి వర్ధిల్లాలి అనే అంశంపై సదస్సులో మాట్లాడి ఆకట్టుకున్నారు.

### లక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగాలి



**కల్వకుర్తి టౌన్:** విద్యార్థులు కళాశాల స్థాయి నుంచే వారి జీవిత లక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్ రెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పాటుగా, విద్య నేర్పుతున్న గురువులకు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు నీతి, నిజాయతీ, క్రమశిక్షణ, సేవాభావాన్ని కలిగి ఉండాలని సూచించారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులు, చదువు నేర్పిన గురువులు ఎంతో గొప్పవారని యోగా గురువు రమేష్ అన్నారు. ఇలాంటి కార్యక్రమాలను చేయటంతో విద్యార్థుల్లో మంచి ఆలోచనలు కలుగుతాయని విద్యార్థుల తల్లిదండ్రులు అన్నారు. సమాజంలో ఎదగటానికి, ఎలా ముందుకెళ్లాలని నిర్దేశం చేస్తున్న గురువులు గొప్పవారని విద్యార్థులు పేర్కొన్నారు. అనంతరం కళాశాలలో 75 మంది విద్యార్థుల తల్లిదండ్రులు, 20 మంది కళాశాల గురువులకు విద్యార్థులు పాదపూజ చేశారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు పీయూలో వర్క్‌షాప్

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** పాలమూరు యూనివర్సిటీ టీ హబ్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ గిరిజ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆడిటోరియంలో నిర్వహించే కార్యక్రమంలో వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ తదితరుల పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమానికి విద్యార్థులు, అధ్యాపకులు హాజరు కావాలని కోరారు.

# అంగన్‌వాడీ.. బలపడి

## ప్రధాన కేంద్రాలుగా మార్పుచెందనున్న మినీ కేంద్రాలు



- ఆప్‌గ్రేడ్ చేస్తూ.. జీఓ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- కొత్త కొలువులకు ఏర్పడనున్న అవ కాశం

| జిల్లాలోని ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు | మినీ అంగన్‌వాడీ కేంద్రాలు |
|---|---|
| 908 | 223 |



**అచ్చంపేట:** అంగన్‌వాడీ కేంద్రాల్లో మార్పులకు చోటుచేసుకుంటున్నాయి. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీలుగా మార్పు చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. మినీ కేంద్రాల స్థాయి పెంచుతూ జీఓ తీసుకురావడంతో కొత్త కొలువులకు అవకాశం ఏర్పడింది.

- జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి, బల్మూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,131 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 908 ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు కాగా.. 223 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 2022 ఆగస్టులో రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమశాఖ అధికారులు అప్‌గ్రేషన్ కోరుతూ జిల్లా సంక్షేమాధికారులను వివరాలు కోరింది. అప్పట్లో మినీ అంగన్‌వాడీ కేంద్రాల అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రతిపాదనలు పంపించారు. అవి ఇప్పుడు ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మారనున్నాయి. అదే విధంగా జిల్లాలో పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరో వైపు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రిటైర్మెంట్ పాలసీ 65 ఏళ్లకు ఖరారు చేయడంతో దాదాపు 150 నుంచి 200 మంది టీచర్లు పదవీ విరమణ పొందాల్సి ఉంటుంది. ఈ క్రమంలో అన్ని రకాల్లో కలిపి 220 పోస్టులు ఖాళీ కానున్నాయి. తాజాగా మినీ కేంద్రాల అప్‌గ్రేషన్‌తో హెల్పర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా.. అంతకు ముందే అంగన్‌వాడీ టీచర్ల పోస్టులు భర్తీ చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు జిల్లాలోని ఖాళీ వివరాలతో ప్రతిపాదనలు పంపించాలని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆదేశించింది.

### జనాభా ప్రాతిపదికన..

జనాభా పెరుగుదల, నివాస ప్రాంతాల విస్తరణ నేపథ్యంలో ఐసీడీఎస్ వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చేందుకు మాతా శిశు సంరక్షణ శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జనాభా ప్రాతిపదికన మినీ అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు, మినీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసేందుకు నిర్ణయించారు.

**పెరగనున్న హెల్పర్ల పోస్టులు**

ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక టీచర్, ఒక హెల్పర్ ఉంటే.. మినీ కేంద్రాల్లో మాత్రం ఒక టీచర్ ఉంటుంది. ఇక్కడ హెల్పర్ ఉండరు. తాజాగా మినీ కేంద్రాలను అప్‌గ్రేడ్‌తో అక్కడ హెల్పర్ పోస్టు అనివార్యమైంది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖకు అప్‌గ్రేడ్ వివరాలు పంపింది. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చడంతో వాటికి కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్ కూడా పెరుగుతుంది. కేంద్ర ప్రభుత్వ అంగీకరిస్తే కొత్తగా హెల్పర్ల నియామకం చేపడుతారు.

### ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి



మినీ అంగన్‌వాడీలను ప్రధాన అంగన్‌వాడీలుగా అప్‌గ్రేషన్ చేయడం సంతోషంగా ఉంది. టీచర్ల జీతాలు పెరగడంతో పాటు హెల్పర్లు రావడంతో ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి. కనీస వేతం రూ.26 వేలు చెల్లించాలి. పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలి. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లించాలి.

– స్వజనమ్మ, అంగన్‌వాడీ టీచర్ మర్రిపల్లి ఉప్పునుంతల మండలం

### ఏరియర్స్ చెల్లించాలి



మినీ కేంద్రాలు ప్రధాన కేంద్రాలుగా మార్చడంతో గర్భిణులు, బాలింతలకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుతాయి. 2018 అక్టోబరులో కేంద్రం పెంచిన వేతనం రూ.750తో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఏరియర్స్‌తో సహా చెల్లించాలి. ఆసరా, కల్యాణలక్ష్మి, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటినీ అమలు చేయాలి. హెల్త్‌కార్డులు ఇవ్వాలి. వేతనంతో కూడిన మెడికల్ సెలవులు చెల్లించాలి.

– లక్ష్మమ్మ, హెల్పర్ వీరంరాజుపల్లి, బల్మూర్ మండలం

### ప్రతిపాదనలు పంపించాం..



మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం, జనాభా ప్రాతిపదికన జిల్లాలో 54 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ప్రధాన కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయడానికి అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ఆమోదం కోరింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆమోదం తర్వాత ఇవీ ప్రధాన కేంద్రాలుగా మారుతాయి.

– వెంకటలక్ష్మి, జిల్లా స్త్రీ శిశు సంక్షేమాధికారి

### పదవీ విరమణ వయస్సు 65ఏళ్లు..

రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పదవీ విరమణ వయస్సును రాష్ట్ర ప్రభుత్వం 65 ఏళ్లుగా ఖరారు చేసింది. ఆదే విధంగా పదవీ విరమణ పొందిన అంగన్‌వాడీ టీచర్లకు రూ.లక్ష, మినీ అంగన్‌వాడీ టీచర్ లేదా హెల్పర్లకు రూ.50 వేల ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. పదవీ విరమణ పొందిన మరసటి నెల నుంచి ఆసరా పింఛన్ కూడా ఇస్తామని, 50 ఏళ్ల వయస్సు కలిగిన అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు రూ.2 లక్షల బీమా సౌకర్యం కల్పించనుంది. సర్వీస్‌లో ఉన్న అంగన్‌వాడీ టీచర్ మరణిస్తే రూ.20 వేలు, మినీ అంగన్‌వాడీ టీచర్/హెల్పర్‌కు రూ.10 వేలు దహన సంస్కారాల నిమిత్తం అందజేయనుంది.

# ఓటరు జాబితాలో పొరపాట్లు లేకుండా చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ పి.ఉదయ్ కుమార్, ఇతర అధికారులు

**కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**

**నాగర్‌కర్నూల్:** తుది ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. సోమవారం ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో తుది ఓటరు జాబితా విడుదలకు ముందు తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలు, క్రాస్ చెక్ చేసుకుంటున్నట్లు తెలిపారు. కొత్తగా ఓటరు నమోదుకు ఫారం 6, డిలిషన్, మార్పు చేర్పులకు ఫారం 7, 8లో 31,865 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. వాటిని క్షేత్రస్థాయిలో బీఎల్‌ఓల ద్వారా పరిశీలించడమే కాకుండా, ఏఈఆర్‌ఓ, ఈఆర్‌ఓ స్థాయిలో క్షుణ్ణంగా అధ్యయనం చేసి, 27,237 దరఖాస్తులు పరిష్కరించామన్నారు. మిగిలిన 4,628 దరఖాస్తులను మూడు రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల కమిషన్ ద్వారా ఓటరు జాబితాను 2018 నుంచి ఇప్పటి వరకు చేపట్టిన ఎస్.ఎస్.ఆర్ ల వారీగా క్రాస్ చెక్ చేసుకోవటం, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, నూతన ఓటర్ల నమోదు గణాంకాలు ఎలా క్రాస్ చెక్ చేసుకోవాలి అనేది పి.పి.టి ద్వారా వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి అదనపు కలెక్టర్లు కుమార్ దీపక్, సీతారామారావు, డీఈఓ గోవిందరాజులు, నోడల్ అధికారి వెంకటరమణ, స్వీప్ నోడల్ అధికారి రామ్మోహన్ రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్‌రెడ్డి, ఆర్డీఓలు వెంకట్ రెడ్డి, గోపిరామ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# 'ప్రజావాణి' దరఖాస్తులు పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ సీతారామారావు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ మనోహర్

**రెవెన్యూ అదనపు కలెక్టర్ సీతారామారావు**

**నాగర్‌కర్నూల్:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని నాగర్‌కర్నూల్ జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ సీతారామారావు అధికారులను ఆదేశించారు. సోమవారం నాగర్‌కర్నూల్ ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి 160 వినతులు స్వీకరించారు. అందులో 112 దరఖాస్తులు ధరణివి కాగా.. 48 దరఖాస్తులు పంచాయతీ రాజ్, మున్సిపల్, మహిళా శిశు సంక్షేమ, బీసీ వెల్ఫేర్ తదితర శాఖలకు చెందిన దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సీతారామారావు మాట్లాడారు. ప్రజావాణిలో వచ్చిన వాటికి అత్యంత ప్రాధాన్యతనిచ్చి సమస్యలు పరిష్కరించి సంబంధిత వెబ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. తమ పరిధిలో లేనివాటిపై ఫిర్యాదుదారులకు తగు మార్గ నిర్దేశం వెంటనే చేయాలని సూచించారు. ఆర్డీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. ధరణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా సంబంధిత తసిల్దార్లు ఫిర్యాదులను పరిష్కరించాలని సూచించారు. తహసీల్దార్లు ధరణి పెండింగ్ ఫిర్యాదులను పరిష్కరించేలా ఆర్డీఓలు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో కెఎల్ఐ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, డీఆర్‌డీఓ నర్సింగ్ రావు, డీటీ బాలరాజ్, ఈడీయం నరేష్, ఎస్ఐసీ హర్షద్ తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**త్వరగా పరిష్కరించాలి**

**నాగర్‌కర్నూల్:** పోలీసు ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించేందుకు సిబ్బంది కృషి చేయాలని ఎస్పీ మనోహర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పోలీసు ప్రజావాణికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 12 మంది ఫిర్యాదుదారులు వచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 8 భూతగాదా గురించి ఫిర్యాదులు, 2 భార్యాభర్తల గొడవల ఫిర్యాదులు, 2 సమస్యలపై న్యాయం చేయాలని ఫిర్యాదులు వచ్చినట్లు తెలియజేశారు.

# 'పథకాల అమలులో తెలంగాణ టాప్'



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

**తాడూరు:** పథకాల అమలులో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని, ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే పాదయాత్ర ప్రారంభించామని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. 'పదేళ్ల ప్రజాప్రస్థానంలో మర్రి పాదయాత్ర' కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని ఇంద్రకల్, లచ్చిరాం తండా, అంతారం గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2012లో తాను రాజకీయాల్లోకి వచ్చి 2014, 18లో ఎమ్మెల్యేగా గెలిచి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ఇంకా చేయాల్సిన పనులు తెలుసుకోవాలని పాదయాత్ర చేపట్టానని చెప్పారు. గతంలో గ్రామాల పరిస్థితి దారుణంగా ఉండేదని, ప్రస్తుతం బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పచ్చని పొలాలతో గ్రామాలు కళకళలాడుతున్నాయన్నారు. 60 ఏళ్లుగా రాని కరెంట్, నీళ్లు ప్రస్తుతం వస్తున్నాయన్నారు. సీఎం కేసీఆర్ శ్రమ కారణంగానే సాగునీటి సౌకర్యం ప్రతి గ్రామానికి వచ్చిందన్నారు. ఇంద్రకల్‌లో 1,174 మంది రైతులకు రూ.19 కోట్లు రైతుబంధు ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. 330 మందికి ఆసరా పింఛన్ల ద్వారా రూ.5 కోట్లు ఇస్తున్నామన్నారు. కల్యాణలక్ష్మి ద్వారా 57 మందికి రూ.57 లక్షలు ఇచ్చామన్నారు. ఇంద్రకల్ నుంచి యాదిరెడ్డిపల్లి గ్రామాల మధ్య రూ.2.20 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టామని తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బైకని శ్రీనివాస్‌యాదవ్, జెక్క రఘునందన్‌రెడ్డి, సర్పంచ్ రమణ, కుర్మనాయక్, జయమ్మ, ఎంపీపీ శ్రీదేవి, ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రకల్‌లో ఎమ్మెల్యేకు బోనాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

# ఘనంగా ప్రపంచ ఫార్మసిస్ట్ డే వేడుకలు




మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్

**నాగర్‌కర్నూల్ క్రైం:** వైద్య ఆరోగ్య శాఖలో ఫార్మసిస్టుల పాత్ర అతి ముఖ్యమైందని, డాక్టర్ తర్వాత ఫార్మసిస్ట్ మాత్రమే రోగికి మందుల మీద అవగాహన కల్పించి, తగిన సూచనలు ఇస్తారని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధాకర్ లాల్ అన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రపంచ ఫార్మసిస్ట్ డే వేడుకలు తెలంగాణ ప్రభుత్వ ఫార్మసిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫార్మసిస్ట్ ఆస్పత్రికి వెన్నుముక అని ఫార్మసిస్ట్ సేవలను ప్రశంసించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ ఔషధి కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్రంలోనే నాగర్‌కర్నూల్ జిల్లాను మొదటి స్థానంలో నిలిపారని, కొవిడ్ సమయంలో వారు అందించిన సేవలు అద్భుతం అని కొనియాడారు. ఫార్మసిస్టులందరికీ ఫార్మసిస్ట్ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా.ప్రదీప్, రేనయ్య, జిల్లా ప్రభుత్వ ఫార్మసిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్ కుమార్, రెడ్‌క్రాస్ సెక్రెటరీ రమేష్ రెడ్డి, ఉప మలేరియా అధికారి ఆర్.శ్రీనివాసులు, అసోసియేషన్ సభ్యులు శ్రీనివాసులు, వెంకటేశ్, బాలరాజు, డి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల పురోగతిపై పర్యటన



మున్సిపల్ కార్యాలయంలో పార్కు పనులు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్

**కల్వకుర్తి టౌన్:** మున్సిపాలిటీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానిక సంస్థల జిల్లా అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మున్సిపాలిటీలోని పలు అభివృద్ధి పనుల పురోగతిపై అదనపు కలెక్టర్ సుడిగాలి పర్యటన చేశారు. అడిషనల్ కలెక్టర్‌గా కుమార్ దీపక్ బాధ్యతలు చేపట్టిన తర్వాత పట్టణంలో పర్యటించటం ఇదే తొలిసారి. పట్టణంలో నూతనంగా నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. షెడ్డు నిర్మాణ పనులు పూర్తయినా.. ప్రారంభించలేదు. అందుకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చూడాలని కమిషనర్ ఆశ్రిత్ కుమార్‌ను ఆదేశించారు. అనంతరం మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో నూతనంగా రూ.కోటి న్నరతో చేపడుతున్న పార్కు పనులు పరిశీలించి, పనుల పురోగతిపై వివరాలు సేకరించారు. కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేస్తున్న భారీ జాతీయ జెండాకు సంబంధించిన వివరాలను ఆరా తీశారు. బస్టాండ్ వద్ద నూతనంగా వీధి వ్యాపారుల కోసం ఏర్పాటు చేస్తున్న స్ట్రీట్ వెండర్ దుకాణాలను తిరిగి చూశారు. వాటితో పాటుగా నూతనంగా మరిన్ని షెడ్లు నిర్మిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. బస్టాండ్ సమీపంలోని గ్రంథాలయాన్ని పరిశీలించారు. భవన నిర్మాణం చేసి ఏళ్లు గడిచిందని, దాని స్థానంలో మరో నూతన గ్రంథాలయ భవనం నిర్మించాలని మున్సిపల్ చైర్మన్ సత్యం అడిషనల్ కలెక్టర్‌కు వివరించారు. పట్టణంలో చేపడుతున్న మరిన్ని పలు అభివృద్ధి పనులను కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు.

**పారిశుద్ధ్య సిబ్బంది కృషి ఎనలేనిది..**

మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది సేవలు చాలా విలువైనవని, వాటి విలువ వెలకట్టలేనిదని అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన పారిశుద్ధ్య కార్మికుల హెల్త్ క్యాంపును ప్రారంభించి మాట్లాడారు. హెల్త్ క్యాంపులే కాకుండా స్వచ్ఛతలో భాగంగా పట్టణ ప్రజలతో మమేకం అవ్వాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ హెల్త్ క్యాంపులో బీపీ, షుగర్, సాధారణ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైస్‌చైర్మన్ షాహెద్, కౌన్సిలర్లు, మున్సిపల్ ఉద్యోగులు, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



# మళ్లీ సమ్మెలోకి పంచాయతీ కార్మికులు

**నాగర్‌కర్నూల్ రూరల్:** గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు పీఆర్‌సీని వెంటనే చెల్లించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఇటీవల సమ్మె చేసిన కార్మికులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చింది. ఆ హామీ ఇచ్చి మరవడంతో మళ్లీ సమ్మెకు వెళ్తున్నామని సోమవారం డీటీఓ కృష్ణకు నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఆర్. శ్రీనివాసులు మాట్లాడారు. 9 మాసాల కిందట రాష్ట్రంలో అన్ని రంగాల కార్మికులకు పీఆర్‌సీని వర్తింపజేసిన సీఎం, గ్రామపంచాయతీ కార్మికులపై స్పందించకపోవడం సరైందికాదని అన్నారు. 34 రోజులుగా నిరవధిక సమ్మె చేసిన కార్మికులతో రెండు దఫాలుగా చర్చలు జరిపి సమ్మెను విరమింపజేసిన ప్రభుత్వం, మాట నిలుపుకోలేదన్నారు. అందుకే మళ్లీ సమ్మెకు సిద్ధం అవుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు వెంకటేశ్వర్లు, రామలు, రామకృష్ణ, బాలరాజు, కొండయ్య, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



డీటీఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

## క్లుప్తంగా

### రైలు ఢీకొని ఒకరి మృతి

బాలానగర్: రైలు ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వివరాల ప్రకారం మండల కేంద్రంలోని రైల్వే బ్రిడ్జి సమీపంలో మహబూబ్ నగర్ వైపు నుంచి కాచిగూడ వెళ్లే ప్యాసింజర్ రైలు గుర్తుతెలియని వ్యక్తిని ఢీ కొనడంతో వ్యక్తి బ్రిడ్జిపై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి సుమారుగా 40 నుంచి 45 సంవత్సరాలు ఉంటుందని పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు బ్లూ కలర్ జీన్స్, ఎల్లో కలర్ షర్టు ధరించి ఉన్నాడని తెలిపారు. వివరాలు తెలిసిన వారు సెల్: 9848090426, 9441407039 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

### లిఫ్ట్ గుంతలో పడి వ్యక్తి..

నాగర్‌కర్నూల్ క్రైం: లిఫ్ట్ గుంతలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేందర్ వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ఖయూం (32) జిల్లా కేంద్రంలో ఓ లస్సీ షాప్‌లో కూలీ పని చేసుకుని జీవిస్తున్నాడు. హౌసింగ్ బోర్డులోని అశోక్ ఇంట్లో నివాసం ఉంటున్నాడు. భవనంలో లిఫ్ట్ కోసం ఏర్పాటు చేసిన గుంతలో పడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. రెండు రోజుల అనంతరం సోమవారం రాత్రి లిఫ్ట్ గుంత నుంచి దుర్వాసన రావడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జనరల్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### మతిస్థిమితం లేని వ్యక్తిపై దాడి.. తీవ్ర గాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: మతిస్థిమితం లేని వ్యక్తితో పాటు అతడి తల్లిపై దాడి చేసిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేందర్ వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో సతీష్ నివాసం ఉంటున్నాడు. అదే కాలనీలో మతిస్థిమితం లేని కిషోర్ తన తల్లి బుచ్చమ్మతో కలిసి జీవిస్తున్నారు. కిషోర్ కాలనీలో తిరుగుతుండగా సతీష్ అతనిపై కర్రతో దాడి చేశాడు. గమనించిన తల్లి బుచ్చమ్మ అడ్డుకునేందుకు యత్నించగా ఆమెను కర్రతో బాదాడు. ఈ ఘటనలో మతిస్థిమితం లేని కిషోర్‌కు తీవ్రగాయాలు కాగా తల్లికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

### రెండు బైక్‌లపైకి దూసుకెళ్లిన బస్సు

- ముగ్గురికి తీవ్ర గాయాలు




హన్వాడ: ఎదురుగా వస్తున్న ఓ బస్సు రెండు బైక్‌లపైకి దూసుకెళ్లడంతో ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన సోమవారం మండలంలోని చిన్నదర్పల్లి సమీపంలోని తాండూర్ ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. చిన్నదర్పల్లికి చెందిన రాములు తన కుమారుడితో కలిసి మండలంలోని మాదారం గ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. అదేవిధంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వీరన్నపేటకు చెందిన ఖలీల్ హన్వాడ వైపు బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో తాండూర్‌వైపు వేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న రెండు బైక్‌లపైకి దూసుకెళ్లడంతో రాములు, అతని కుమారుడు శ్రీనివాసులు, ఖలీల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవినాయక్ పేర్కొన్నారు.

### జూరాలకు పెరిగిన వరద

- 7 యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం

ధరూరు/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద పెరిగింది. సోమవారం రాత్రి 8 గంటల వరకు ప్రాజెక్టుకు 20వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైనట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో ఏడు యూనిట్లల్లో విద్యుదుత్పత్తిని ప్రారంభించినట్లు ఎస్ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. ఎగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రంలో 4 యూనిట్ల ద్వారా 156 మెగావాట్లు, దిగువలో 3 యూనిట్లతో 120 మెగావాట్ల విద్యుదుత్పత్తి అవుతున్నట్లు పేర్కొన్నారు. ఎగువ, దిగువ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కోసం 17,919 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని తెలిపారు. ఆవిరి రూపంలో 94, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, భీమా లిఫ్ట్–1కు 650, కోయిల్‌సాగర్‌కు 315, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 731, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులతో కలిపి మొత్తం 21,489 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 9.255 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

**శ్రీశైలంలో 853.6 అడుగులు**

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో సోమవారం 853.6 అడుగుల వద్ద 87.2691 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 17,919 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం జలాశయానికి వదులుతున్నారు. 24గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడుకు 2వేలు, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,885, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకి 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. జలాశయంలో 69 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.





### మహాత్మా.. ఇదేం పరిస్థితి

నారాయణపేటకు కేటాయించిన మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల రెండేళ్లుగా మరికల్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలను అద్దెకు తీసుకొని నిర్వహిస్తున్నారు. భవన నిర్మాణం అసంపూర్తిగా ఉండటం.. కిటికీలకు అద్దాలు లేకపోవడంతో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నీరంతా గదుల్లోకి చేరి పుస్తకాలు, దుస్తులు, ఇతర సామగ్రి తడిసి ముద్దయ్యాయి. గదుల్లో వర్షపు నీరు నిల్వడంతో విద్యార్థులు రాత్రంతా జాగారం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. సోమవారం విద్యార్థులు తడిసిన పుస్తకాలు, దుస్తులను ఆరబెట్టుకోవడం కనిపించింది. అసంపూర్తి అద్దె భవనంలో నిత్యం ఇబ్బందులు పడుతున్నామని.. వెంటనే నారాయణపేటకు తరలించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

– మరికల్

# ఎట్టకేలకు..

**ప్రారంభమైన పీజేపీ రహదారి పనులు**

- మస్తీపురం నుంచి కిష్టంపల్లి వరకు రోడ్డు విస్తరణ
- 4కి.మీ.మేర నిర్మాణానికి రూ.3కోట్లు మంజూరు



కొనసాగుతున్న జూరాల ప్రాజెక్టు రోడ్డు విస్తరణ పనులు

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు రహదారి పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోక అధ్వానంగా మారిన రోడ్డుపై రాకపోకలు సాగించలేక వాహనదారులు, ప్రజలు అవస్థలు పడ్డారు. ఆయా గ్రామాల ప్రజలు, వివిధ పార్టీల పోరాటంతో మరుగున పడిన రహదారి విస్తరణ పనులు మొదలయ్యాయి. మస్తీపురం నుంచి కిష్టంపల్లి వరకు 4కి.మీ.మేర బీటీరోడ్డు నిర్మాణ పనులను రూ.3కోట్లతో చేపట్టారు. నాలుగు రోజులుగా రహదారి విస్తరణ పనులు చురుకుగా సాగుతున్నాయి. ఈనెలాఖరులోగా పనులను పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రోజూ పనులను పర్యవేక్షిస్తూ వేగం పెంచారు. మస్తీపురం క్రాస్‌రోడ్డు నుంచి కిష్టంపల్లి క్రాస్‌రోడ్డు వరకు సుమారు 7.5 కి.మీ. మేర రోడ్డు విస్తరణ కోసం గత కృష్ణా పుష్కరాల సమయంలో పనులు చేపట్టారు. సదరు కాంట్రాక్టర్ పనులను అసంపూర్తిగా వదిలేయడంతో రహదారి నిర్మాణం అటకెక్కింది. వచ్చిన నిధులు సైతం వెనక్కి వెళ్లాయి. అధికారులు మరోమారు టెండర్లు నిర్వహించి ప్రాజెక్టు రహదారి పనులు చేపట్టారు.

**ఏడాదిగా సా..గుతున్న పనులు..**

గత వర్షాకాలంలో మస్తీపురం క్రాస్‌రోడ్డు నుంచి మస్తీపురం వరకు 3కి.మీ.మేర రహదారి విస్తరణ పనులను రూ.కోటి నిధులతో ప్రారంభించారు. ప్రాజెక్టు వరకు రహదారి నిర్మిస్తారని ఆశ పడిన ప్రజలు, వాహనదారులకు నిరాశే మిగిలినట్టయ్యింది. ప్రాజెక్టు వరకు రహదారిని విస్తరించకపోవడంతో వాహనదారులు అవస్థలు పడాల్సి వచ్చింది. ఏడాది తర్వాత మిగిలిన రహదారి విస్తరణ పనులు చేపట్టడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**600 మీటర్ల మేర సీసీరోడ్డు నిర్మాణం..**

మస్తీపురం శివారు నుంచి గ్రామం వరకు మొత్తం 600 మీటర్ల మేర సీసీరోడ్డు నిర్మించనున్నట్లు పంచాయతీరాజ్ అధికారులు వెల్లడించారు. నిబంధనల మేరకు గ్రామం మధ్యలో బీటీ నిర్మించకూడదని పేర్కొన్నారు. సీసీరోడ్డు నిర్మాణానికి గ్రామస్తులు సహకరించాలని కోరారు.

**ఆందోళనలతోనే రోడ్డు నిర్మాణం..**



జూరాల ప్రాజెక్టు వరకు రహదారి విస్తరణ పనులు చేపట్టాలని పలు దఫాలుగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాం. గుంతలమయంగా మారిన రహదారిపై ఎంతోమంది ప్రమాదాలకు గురయ్యారు. ప్రజల అవసరాలను గుర్తించి అసంపూర్తిగా నిలిచిన రోడ్డు విస్తరణ పనులను చేపట్టడం సంతోషంగా ఉంది.

– రాజు, మస్తీపురం

**ఎమ్మెల్యే చొరవతో..**



ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవతో అసంపూర్తిగా ఉన్న జూరాల ప్రాజెక్టు ప్రధాన రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. రోడ్డు పనులను అసంపూర్తిగా వదిలేసిన కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టి.. మరోమారు రీటెండరింగ్ వేసి పనులను పూర్తి చేయడానికి ఎమ్మెల్యే కృషి చేశారు.

– బాల్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ

**నెలాఖరులోగా పూర్తి చేస్తాం..**

ఈనెలాఖరులోగా జూరాల ప్రాజెక్టు రహదారి విస్తరణ పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. మొత్తం 4 కి.మీ.మేర రహదారి విస్తరణ పనులను రూ.3కోట్లతో చేపడుతున్నాం. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను వేగవంతంగా పూర్తి చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశాం.

– శ్రీనివాసులు, ఈఈ, పీఆర్

# పీఆర్‌సీపై వైద్యుల హర్షం



కేక్ కట్ చేస్తున్న డైరెక్టర్ రమేష్, సూపరింటెండెంట్ జీవన్

- 36 విడతల లాకింగ్ పీరియడ్ సరికాదు
- టీచింగ్ ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామకిషన్

పాలమూరు: ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వైద్యుల యూజీసీ పీఆర్‌సీ ఏరియర్స్ విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం సంతోషంగా ఉందని టీచింగ్ ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామకిషన్ అన్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో సంఘం ఆధ్వర్యంలో కళాశాల డైరెక్టర్ రమేష్, ఆస్పత్రి సూపరింటెండెంట్ జీవన్‌లతో పాటు ఇతర వైద్యులు కలిసి సోమవారం కేక్ కట్ చేసి సీఎం కేసీఆర్‌తో పాటు వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రామకిషన్‌తో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ ప్రకాష్ మాట్లాడారు. 2016 వచ్చిన పీఆర్‌సీ మళ్లీ 2020లో రావాల్సి ఉండగా రాలేదన్నారు. అప్పటి నుంచి పీఆర్‌సీ విడుదలపై పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లగా, ఈ నాలుగేళ్ల పీఆర్‌సీ యూజీసీ వేతనాలు అందుకుంటున్న ప్రొఫెసర్లకు రూ.15లక్షల నుంచి రూ.20లక్షల వరకు, అసోసియేట్‌లకు రూ.10లక్షల నుంచి రూ.15వరకు అసిస్టెంట్లకు రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు పీఆర్‌సీ వస్తుందన్నారు. అక్టోబర్ నుంచి పీఆర్‌సీని 36 విడతల్లో ఇవ్వాలని చెప్పిన అలా కాకుండా ఒకే సారి ఖాతాల్లో జమ చేయడానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. 36 విడతల్లో పీఆర్‌సీ ఇస్తూ లాకింగ్ పిరియడ్ పెట్టడం సరికాదన్నారు. దీనిపై ప్రభుత్వం మళ్లీ ఆలోచన చేయాలన్నారు. అదేవిధంగా జనరల్ బదిలీలలో అన్ని కళాశాలలో ఉన్న ఖాళీలు చూపకుండా కేవలం కొత్తగా ఏర్పాటైన మెడికల్ కళాశాలలో చూపడం సరికాదన్నారు. రాష్ట్రంలో ఉన్న 26 మెడికల్ కళాశాలలో ఉన్న ఖాళీలు చూపితేనే జనరల్ బదిలీలు అవుతాయని తెలిపారు. 2018లో జనరల్ బదిలీలు అయ్యాయని, మళ్లీ ఇప్పటి వరకు నిర్వహించలేదన్నారు. ఉస్మానియా, గాంధీ, సిద్దిపేట, వరంగల్, మహబూబ్‌నగర్, నిజామాబాద్ కళాశాలలో కూడా ఖాళీలు చూపాలన్నారు. కార్యక్రమంలో సిరాజుద్దీన్, డాక్టర్ నజ్మా, గీతా మీనాక్షి, రంజిత్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

### జూపల్లి కార్యాలయం ఎదుట వివాహిత ధర్నా



కొల్లాపూర్: పట్టణంలోని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కార్యాలయం ఎదుట వివాహిత ధర్నా చేపట్టింది. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కార్యాలయం గేటు వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేసింది. వివరాల్లోకి వెళ్తే.. మేడ్చల్‌కు చెందిన మోనికను కోడేరు మండలం రాజాపూర్‌కు చెందిన గోపాలఅంజి మూడున్నరేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఏడాది వయస్సుగల బాబు ఉన్నాడు. పెళ్లి చేసుకున్న తర్వాత తనను ఇప్పటి వరకు రాజాపూర్‌కు రానివ్వలేదని, కట్నం తీసుకొస్తేనే మా ఇంటికి రావాలని గోపాల అంజి తనను బెదిరిస్తున్నట్లు మోనిక తెలిపారు. కొన్ని రోజుల కిందట తాను రాజాపూర్‌కు వస్తే ఇంట్లోకి రానివ్వకుండా బయటికి గెంటేశారని పేర్కొన్నారు. ఈ విషయంపై న్యాయ పోరాటం చేస్తున్నట్లు వెల్లడించారు. దీనిపై తాను గతంలో జూపల్లి కృష్ణారావుకు ఫోన్ చేసి సమస్యను వివరిస్తే.. గోపాల అంజి మా పార్టీ కార్యకర్త అని, నీకు న్యాయం చేస్తానని చెప్పారన్నారు. కానీ ఇప్పటివరకు ఆయన పట్టించుకోలేదని.. తాను న్యాయ పోరాటం చేస్తుండడంతో గోపాలఅంజి నుంచి బెదిరింపులు వస్తున్నాయన్నారు. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా ఆమెను అక్కడి నుంచి పంపించేందుకు జూపల్లి అనుచరులు ప్రయత్నించారు. ఆమె మొండికేయడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకొని ఆమెకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించింది. దీనిపై మోనిక భర్త గోపాలఅంజి స్పందించారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే తన భార్యతో అధికార పార్టీ నాయకులు ధర్నా చేయించారని ఆరోపించారు. తన వ్యక్తిగత విషయానికి జూపల్లి కృష్ణారావుకు ఎలాంటి సంబంధం లేదన్నారు.

# ఎవరికీ భయపడే ప్రసక్తే లేదు..

- వర్కటం జగన్నాథరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వర్కటం జగన్నాథరెడ్డి

మక్తల్: నియోజకవర్గంలో తనను ఎవరు భయభ్రాంతులకు గురిచేసినా భయపడే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ నాయకుడు వర్కటం జగన్నాథరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఊట్కూర్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలు నా కారుపై దాడి చేసి అద్దాలు పగలగొట్టారని, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అనుచరులు తనపై దాడి చేశారన్నారు. వాట్సాప్‌లో ఎవరో ఎమ్మెల్యే పేరుపై తప్పుడు ప్రచారం చేస్తే.. పోలీసులు తనను పిలిపించడం సరికాదన్నారు. తాను ఏమి చేయలేదని, ఇతరులు చేసింది తనపై ఎందుకు వేస్తారని అన్నారు. నేను ఏమైనా తప్పు చేస్తే.. నాపై కేసు నమోదు చేయవచ్చని అన్నారు. తనకు టికెట్ రాకుంటే మక్తల్ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని అన్నారు. తనకు జరిగిన దాడిని అధిష్టానానికి తెలుపుతానని అన్నారు. ఈ విషయంపై ఎస్పీ వెంకటేశ్వర్లు, డీఎస్పీ సత్యనారాయణకు ఫిర్యాదు చేశామన్నారు. సమావేశంలో వర్కటం అంజనారెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### కారు దగ్ధం

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రమాదవశాత్తు కారుకు నిప్పు అంటుకొని దగ్ధమైన ఘటన జిల్లా కేంద్రంలోని 14వ వార్డులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన ప్రవీణ్ తన కారును నిర్మాణంలో ఉన్న ఇంట్లో నిలిపాడు. ప్రమాదవశాత్తు కారుకు నిప్పు అంటుకొని దగ్ధమైంది. గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించడంతో ఫైర్ అధికారి కృష్ణమూర్తి ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనపై బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

## రాష్ట్ర స్థాయి యోగాసనాల్లో బంగారు పతకం



పతకం, సర్టిఫికెట్ అందుకుంటున్న వనజారెడ్డి

మహబూబ్‌నగర్ క్రీడలు: రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌లో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన సీనియర్ యోగా క్రీడాకారిణి వనజారెడ్డి ప్రతిభచాటారు. ఈ పోటీల్లో ట్రెడిషనల్ యోగాలో బంగారు పతకం సాధించారు. గతంలో పలు రాష్ట్ర, జాతీయస్థాయి యోగా పోటీల్లో రాణించారు. ఆమెకు పతకం రావడంపై జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

## ఉత్సాహంగా అండర్-19 ‘హ్యాండ్‌బాల్’ ఎంపికలు



హ్యాండ్‌బాల్ జట్లతో కార్యదర్శి పాపిరెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లు విజేతగా నిలవాలని అండర్–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి పాపిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో సోమవారం అండర్–19 ఉమ్మడి జిల్లా బాల, బాలికల హ్యాండ్‌బాల్ జట్ల ఎంపికలు నిర్వహించారు. ఎంపికలకు బాలురు 100 మంది, బాలికలు 85 మంది హాజరయ్యారు. ఎంపికలను పాపిరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో ప్రతిభచాటి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అండర్–19 ఎస్‌జీఎఫ్ క్రీడల్లో గతంలో పలు రాష్ట్రస్థాయి టోర్నీల్లో ఉమ్మడి జిల్లా జట్లు మెరుగైన ప్రతిభ కనబరచారని, ఇదే స్ఫూర్తితో రానున్న పోటీల్లో రాణించాలన్నారు. బాలురు 20, బాలికలు 20 మందిని ప్రాబబుల్స్‌కు ఎంపిక చేసి వచ్చే నెల 1 నుంచి ప్రత్యేక కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎండి.జియావుద్దీన్, పీడీ బాల్‌రాజు, అహ్మద్ హుస్సేన్, రాంమోహన్‌గౌడ్, ప్రదీప్ పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

వనపర్తిటౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జెడ్పీ చైర్మన్ ఆర్. లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బాలకృష్ణయ్య క్రీడా ప్రాంగణంలో 2వ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాస్థాయి మైనార్టీ స్కూల్స్ బాలికల క్రీడా పోటీలను జ్యోతి ప్రజ్వలన, జెండా ఆవిష్కరణ చేసి ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం పెరుగుతుందన్నారు. ఉన్నతంగా ఎదిగిన క్రీడాకారులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆర్డీఓ పద్మావతి, జిల్లా యువజన క్రీడాధికారి సుధీర్‌కుమార్ రెడ్డి, ఆర్ఎల్‌సీబీ. హవీలా రాణి, వనపర్తి మైనార్టీ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ కె. సౌమ్య, ఉమ్మడి జిల్లా మైనార్టీ స్కూల్స్ ప్రిన్సిపాల్స్, పీఈటీలు, పీడీలు, ఎస్కాట్ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ‘పాలమూరు’ను సందర్శించిన జెన్‌కో బృందం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎల్లూరు శివారులో ఉన్న పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును సోమవారం జెన్ కో డిజైన్ టీం ఉన్నతాధికారుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ప్యానల్ బోర్డు, డెలివరీ పంపులు, ఇన్‌టెక్‌వెల్‌ను పరిశీలించారు.

**నీటి విడుదల వాయిదా..**

పాలమూరు ప్రాజెక్టు మొదటి పంపు నుంచి సోమవారం నీటి విడుదల చేస్తామని అధికారులు మూడురోజుల కిందట ప్రకటించారు. ట్రాన్స్‌కో అధికారులు రాకపోవడంతో వాయిదా పడింది. ఈ నెల 16న ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక పంపును ప్రారంభించి నార్లాపూర్ రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేసిన విషయం పాఠకులకు విదితమే. ఆ రోజు సుమారు మూడు గంటలు పాటు నీటి సరఫరా చేసి తర్వాత నిలిపివేశారు. తిరిగి సోమవారం ప్రారంభిస్తామని చెప్పినా పవర్ డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ట్రాన్స్‌కో అధికారులు రాకపోవడంతో నీటి విడుదల వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు.

## ప్రధాని బహిరంగ సభను విజయవంతం చేయండి



బహిరంగ సభ స్టేజీ వద్ద పూజలు చేస్తున్న జితేందర్‌రెడ్డి

- జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి

భూత్పూర్: మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మున్సిపాలిటీలోని అమిస్తాపూర్ వద్ద అక్టోబర్ 1న నిర్వహించే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభకు లక్షలాది మంది ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. అమిస్తాపూర్ వద్ద బహిరంగ సభ జరిగే ప్రాంగణాన్ని పరిశీలించిన అనంతరం జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మ చారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.సుదర్శన్‌రెడ్డి, ఎగ్గని నర్సింహులు, రవీందర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్, పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఇన్‌చార్జ్ కేవీఎన్‌రెడ్డిలతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ మహబూబ్‌నగర్ పాలనలో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రావాలని, కేంద్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఉండాలన్నారు. మోదీ మహబూబ్‌నగర్ ఎంపీగా నిలబడాలని, భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. మోదీ మహబూబ్‌నగర్ ఎంపీగా గెలిస్తే సౌత్ హబ్‌గా అవుతుందని, ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక సౌత్ హబ్‌గా ఏర్పడనుందని మోదీకి ఉత్తరం అందజేశామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలో 5 ఉచిత పథకాలతో అధికారంలోకి వచ్చిందని, రూ.40 వేల కోట్లు ఖర్చు అవుతుందన్నారు. ఉచిత పథకాలు ఇవ్వడం సాధ్యం కాదని స్వయంగా కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీ.కె.శివకుమార్ ఓ ప్రకటనలో తెలిపారన్నారు. తెలంగాణలో 6 గ్యారంటీ పథకాలు సైతం ఉచితంగా ఇస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు బుకాయిస్తున్నారని, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల బుకాయించే పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.

**రేపు కె.లక్ష్మణ్ రాక..**

క్రిష్టియన్‌పల్లిలోని ఏఎస్ఎన్ గార్డెన్‌లో జరిగే బీజేపీ నేతలు, నాయకుల సమావేశానికి రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చ జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ వస్తున్నారని జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి తెలిపారు. మధ్యాహ్నం అమిస్తాపూర్ వద్ద మోదీ బహిరంగ సభ ప్రాంగణాన్ని పర్యవేక్షిస్తారని తెలియజేశారు. కార్యక్రమంలో రూరల్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు రవీందర్, ఆంజనేయులు, సదానంద్, పట్నం శ్రీను, మల్లేష్, శ్రీశైలం, ఫారూఖ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.